ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
మంగళవారం 11 జూన్ 2024 | 3



13న మండపేటలో
రాష్ట్ర ఐఎఫ్‌టీయూ సమావేశం
వార్త: 5వ పేజీలో



సమస్యల పుట్ట

సబ్‌స్టేషన్లలో ఏఈల కొరత
విద్యుత్ పరికరాల సరఫరా నిల్
తరచూ ఇబ్బందులు

అలమూరు, జూన్ 10: ఏడాది కాలంగా విద్యుత్ సబ్‌స్టేషన్లకు పరికరాలు సరఫరా చేయకపోవడంతో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. జిల్లా వ్యాప్తంగా విద్యుత్ శాఖలో సబ్‌స్టేషన్లలో అసిస్టెంట్ ఇంజనీర్ల కొరత అధికంగా ఉంది. దిగువస్థాయి ఉద్యోగుల చేత పనిచేస్తూ కాలక్షేపం చేస్తున్నారు. ఇదే పరిస్థితి మరికొంతకాలం జరిగితే విద్యుత్ సరఫరా చేయడం కష్టమని ఆ శాఖ ఉద్యోగులు బహిరంగంగానే చెబుతున్నారు. ఏడాది కాలంగా ఉన్న పాత వైర్లతో అతుకులు పెట్టి విద్యుత్ సరఫరా చేస్తున్నామని మరికొంత కాలానికి ఆ వైర్లు కూడా పోతే చేసేది ఏమిలేదని వారు వాపోతున్నారు. ఉదాహరణకు మండపేట సబ్‌డివిజన్ పరిధిలో ఐదు మండలాలలో ఆలమూరు, ద్వారపూడి, రాయవరం, ఏడిద, అంగర సబ్‌స్టేషన్లు ఉన్నాయి. వీటిలో ఏడిద మినహా మిగిలిన నాలుగు సబ్‌స్టేషన్లలో అసిస్టెంట్ ఇంజనీర్లు లేక దిగువస్థాయి సిబ్బందితో నడిపిస్తున్నారు. ఆలమూరులో 2022 జూన్ 5నుంచి సబ్‌స్టేషన్‌కు అసిస్టెంట్ ఇంజనీరును నియమించలేదు. ఇలాంటి పరిస్థితే దాదాపుగా జిల్లా వ్యాప్తంగా ఉన్నట్లు సమాచారం. ఇటీవల కాలంలో విద్యుత్ వాడకం అధికం కావడంతో వైర్లు తీవ్రంగా దెబ్బతింటున్నాయని దీనికి వినియోగదారులు కూడా బాధ్యులని చెబుతున్నారు. అనేక మంది ఇంటికి వేసుకున్న మీటర్ స్థాయికి మించి విద్యుత్ వాడకం వల్ల విద్యుత్ సరఫరాలో సమస్యలు వస్తున్నాయని అంటున్నారు. విద్యుత్ మీటర్‌స్థాయిలో విద్యుత్ వాడకం పెంచకుంటే విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు ఉండవని వారు చెబుతున్నారు.



దీవెన రాక దిగులు

విడుదల చేయని జగనన్న విద్యాదీవెన నిధులు

బకాయిలు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామంటున్న కాలేజీ యాజమాన్యాలు

అమలాపురం టౌన్, జూన్ 10:

జగనన్న విద్యాదీవెన పథకం నిధులను సకాలంలో విడుదల చేయకపోవడంతో ఇంజనీరింగ్ విద్యార్థులు లబోదిబోమంటున్నారు. ఫైనల్ ఇయర్ విద్యార్థుల పరిస్థితి అయితే మరీ దయనీయంగా ఉంది. కళాశాలలకు చెల్లించాల్సిన మొత్తం ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని యాజమాన్యాలు మెలిక పెట్టాయి. దీంతో చేసేది లేక విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులుచేసి ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంజనీరింగ్ విద్యార్థులకు ఏడాదికి నాలుగు క్వార్టర్లకుగాను గత ఏడాది ఒక్క విడత మాత్రమే విద్యాదీవెన నిధులను విడుదల చేశారు. మిగిలిన మూడు విడతల సొమ్ములు కూడా కళాశాలలకు చెల్లించాల్సిందేనని యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి పెంచాయి. ఫీజులు చెల్లిస్తేనే కళాశాలలు నడిపే పరిస్థితి ఉందని యాజమాన్యాలు చెప్పేస్తున్నాయి. దాంతో ఇదెక్కడి విద్యాదీవెన పథకంరా బాబోయ్ అంటూ విద్యార్థులే కాదు వారి తల్లిదండ్రులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సర్టిఫికెట్లు ఎలా?

ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఈ ఏడాది మార్చి-ఏప్రిల్ మధ్య జరిగిన ఎనిమిదో సెమిస్టర్ ఫలితాలు ఇప్పటికే విడుదలయ్యాయి. అప్పటికే ఆ విద్యార్థులంతా ఫీజుల ఒత్తిడితోనే పరీక్షలు రాయాల్సిన పరిస్థితి. కొన్ని కళాశాలల్లో అయితే ఫీజులు పూర్తిగా చెల్లిస్తేనే పరీక్షలు రాయించేది అని ముందుగానే హెచ్చరించారు. వాటి అన్నింటినీ అధిగమించి విద్యార్థులు మానసిక స్థైర్యంతో పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. కొందరైతే ఇప్పటికే ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు సైతం దక్కించుకున్నారు. ఆయా ఉద్యోగాలకు వెళ్లాలంటే ఇంజనీరింగ్ సర్టిఫికెట్లు ఎంతో అవసరం. ఆ సర్టిఫికెట్లు పొందాలంటే ఫీజులు మొత్తం చెల్లించాల్సిన పరిస్థితి. ప్రభుత్వం విద్యాదీవెన విడుదల చేయలేదని తమ బ్యాంకు ఖాతాలకు జమ అయిన వెంటనే చెల్లిస్తామని చెబుతున్నా పట్టించుకునేవారే లేరు. యాజమాన్యాలు మాత్రం వారు ఎదుర్కొంటున్న సమస్యలను చెప్పుకొస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. ఫైనల్ ఇయర్ పూర్తి చేసుకున్న విద్యార్థులు సుమారు 3వేల మంది వరకు ఉన్నారు. ప్రస్తుతం వీరి పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది. ఇక మిగిలిన ఇంజనీరింగ్ విద్యార్థులకు సకాలంలో ఫీజులు విడుదల కాక యాజమాన్యాల ఒత్తిళ్లతో మానసిక క్షోభను అనుభవిస్తున్నారు.

మొత్తం మార్చేశారు..

ఫీజుల ఒత్తిడి విద్యార్థులపై ఉండకూడదని గతంలో కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు నేరుగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలకు చెల్లించేవారు. అప్పట్లో ఆరు నెలల పాటు ఫీజుల విడుదలలో జాప్యం జరిగినా యాజమాన్యాలు మాత్రం ఎప్పుడు విద్యార్థులపై ఒత్తిడి తీసుకువచ్చేవి కాదు. జగన్ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించినట్టే జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన అంటూ పేర్లు పెట్టి తల్లిదండ్రులను నిండా ముంచేశారు. విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకే నేరుగా జగనన్న విద్యాదీవెన విడుదల చేస్తామని గొప్పలు చెప్పారు. ఒక్క ఏడాది కూడా సక్రమంగా నిధులు విడుదల చేసిన పాపాన పోలేదు. కొవిడ్ సమయంలో ఒక విడత విద్యాదీవెనను ప్రభుత్వం ఎగ్గొట్టడంతో ఆ సొమ్ములను సైతం విద్యార్థులే చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక వసతి దీవెన అయితే వస్తుందో రాదో కూడా తెలియని అయోమయ పరిస్థితి. కనీసం విద్యాదీవెన సొమ్ముల అయినా సకాలంలో విడుదల చేసి ఉంటే తాము అప్పుల పాలు అయ్యేవారం కాదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొంపముంచిన పథకం

2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒక విడత విద్యాదీవెన నిధులు మాత్రమే వైసీపీ ప్రభుత్వం విడుదల చేసింది. ఒక పాత బకాయి అలాగే ఉండిపోయింది. మొత్తంగా ఒక్కో విద్యార్థిది నాలుగు విడతల విద్యాదీవెన బకాయిలు చెల్లించాల్సి ఉంది. అసలు ఆ సొమ్ములు విడుదల అవుతాయా లేదా అన్న ఆందోళన నెలకొంది. ఇప్పటికి రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. ఏ విధమైన నిర్ణయాలు తీసుకుంటారో తెలియదు. అందుకే బకాయిలు మొత్తం కట్టించుకుంటున్నామని యాజమాన్యాలు చెబుతున్నాయి. ఈ తరహా ఒత్తిళ్లతో చదివించలేమని, గతంలో మాదిరిగానే కళాశాలలకే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించి విద్యార్థులను ఆదుకోవాలని తల్లిదండ్రులు అధికారం చేపట్టనున్న కూటమి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వం బకాయి పడ్డ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సైతం చెల్లించి అప్పుల ఊబి నుంచి కాపాడాలని వేడుకుంటున్నారు. 2019లో ఎంబీఏ, ఎంసీఏ చదువుకున్న విద్యార్థులకు వైసీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంటును ఇంత వరకు విడుదల చేయలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు అందరికీ ఉచిత విద్య అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం ఉన్నత చదువులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఎత్తేసింది. ఇవన్నీ కూటమి ప్రభుత్వం గుర్తించి విద్యారంగాన్ని కాపాడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

> గత టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చక్కగా సాగుతున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి సంస్కరణల పేరుతో వైసీపీ ప్రభుత్వం తూట్లు పొడిచింది. ఇప్పుడు ఆ ఫలితాన్ని విద్యార్థులు అనుభవిస్తున్నారు..

> తల్లుల ఖాతాల్లో సొమ్ము వేస్తామని చెప్పి పూర్తి సొమ్ము జమ చేయకపోవడంతో ఇప్పుడు కాలేజీలు విద్యార్థుల పీక మీద కత్తి పెట్టి డబ్బులు చెల్లించాలని వేధిస్తున్నాయి. సర్టిఫికెట్లు ఇవ్వనంటున్నాయి..


అల్లవరం పంటకాలువ

ఖరీఫ్‌కు నీరేది?

బెండా పంట కాలువలకు నేటికీ అందని సాగునీరు
ఆయకట్టు రైతుల ఆందోళన
సాగునీరు ఇవ్వకుంటే ఉద్యమమే
రైతుల హెచ్చరిక

అల్లవరం, జూన్ 10: జూన్ రెండో వారం ప్రారంభమైన బెండా పంట కాలువకు నేటికీ సాగునీరు రాలేదని నారుమడులు ఎలా వేయాలంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని మూడువేల ఎకరాలు ఆయకట్టు ఉన్న బెండా పంట కాలువకు యుద్ధ ప్రాతిపదికన సాగునీరు ఇవ్వకుంటే ఉద్యమం చేపడతామని రైతులు హెచ్చరిస్తున్నారు. సాగునీరు ఇబ్బందులు వల్ల మరలా పంట విరామం తప్పదని పలువురు ఆవేదన చెందారు. బోడసకుర్రు వద్ద రూ.1.50 కోట్లతో బెండా పంట కాలువపై వంతెన నిర్మాణం చేపడుతున్నందున మరో వారం రోజుల పాటు దిగువ ఆయకట్టుకు సాగునీరు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. నారుమడులు పోయడంలో జాప్యం జరిగితే ఆగస్టులో వరదలు, వర్షాలకు పంట పొలాలు ముంపుబారిన పడే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో పక్క బెండాకాలువ శివారున బెండమూర్లంక నుంచి నేరుగా ఓడలరేవు ఓఎన్‌జీసీ సైటుకు గడిచిన రెండేళ్లుగా సాగునీరు తోడేస్తుండటంతో ఏటా రైతులు నష్టాలు చూస్తున్నారు. జూన్ 15వ తేదీలోపు నారుమడులు వేయకుంటే ఊడ్పులు జరగవని బెండాకాలువ అనుబంధ పంట కాలువలకు మరో రెండు రోజులులోగా సాగునీరు ఇవ్వాలంటూ అల్లవరానికి చెందిన రైతులు పెన్మత్స సత్యనారాయణరాజు, బుద్ధరాజు సత్యనారాయణరాజు ఇరిగేషన్ ఏఈ రెహ్మాన్‌ను కలిసి సాగునీటి సమస్యను వివరించారు. మరో రెండు రోజుల్లో నీరు ఇస్తానంటూ ఏఈ హామీ ఇస్తున్నప్పటికీ నమ్మకం లేదన్నారు. రెండు రోజుల్లోగా సాగునీరు ఇవ్వకుంటే రైతు ఉద్యమం తప్పదని హెచ్చరిస్తున్నారు.

వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో
అప్రమత్తంగా ఉండాలి

అమలాపురం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమై ప్రాణ, ఆస్తి నష్ట నివారణ చర్యలకు ముందుగానే ఉపక్రమించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు ఆదేశించారు. వాతావరణ శాఖ సూచనల మేరకు తుపానులు, వరదలు సంభవించడంతో పాటు భారీ వర్షాలు కురుస్తాయన్న అంచనాలతో ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జాతీయ విపత్తుల స్పందన ఫోర్స్ పదో బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ, పోలీసు, అగ్నిమాపక అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఆర్వో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ఆధ్వర్యంలో పోలీసు, అగ్నిమాపక, రెవెన్యూ సిబ్బందికి రెస్క్యూ ఆపరేషన్లపై అవగాహన పెంపొందించనున్నట్లు చెప్పారు. బోడసకుర్రు గోదావరి రేవులో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహణపై త్వరలోనే మాక్ డ్రిల్ నిర్వహించనున్నట్టు తెలిపారు. మాక్ డ్రిల్‌కు జిల్లాలోని ఆపద మిత్రులను కూడా తీసుకురావాలన్నారు. ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ 2006లో 16 బెటాలియన్లతో 16 వేల మంది సిబ్బందితో జాతీయ విపత్తు స్పందన విభాగం ఏర్పడిందన్నారు. ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. మాక్ డ్రిల్‌లో ఆయా శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, రవికుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఆకలి తీర్చేందుకు వస్తున్నాయ్..

టీడీపీ ప్రభుత్వ హయాంలో పేదల ఆకలి తీర్చిన అన్న క్యాంటీన్లు
తక్కువ ధరకు అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం
వైసీపీ ప్రభుత్వం రావడంతో పేదల ఆకలి తీర్చే కేంద్రాలపై కక్ష
రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని అన్న క్యాంటీన్లను మూసివేయించిన వైనం
ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో చిగురిస్తున్న ఆశలు
త్వరలోనే అన్న క్యాంటీన్లు వస్తున్నాయంటూ ప్రచారం

> పేదల ఆకలి తీర్చేందుకు త్వరలో అన్న క్యాంటీన్లు వస్తున్నాయనే ప్రచారం జోరుగా సాగుతోంది. గత ప్రభుత్వంలో పేదలపై ఎంతో ప్రేమతో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా అన్న క్యాంటీన్లను తీసుకువచ్చారు. కేవలం రూ.5 రూపాయల ధరలో టిఫిన్, మధ్యాహ్న, రాత్రి భోజనం అందించారు. వివిధ పనుల కోసం పట్టణాలకు వచ్చే పేదవారు, రిక్షా, ఆటో కార్మికులు, వివిధ వ్యాపార సంస్థల్లో పనిచేసే పనివార్లను ఈ క్యాంటీన్లు అమ్మలా అక్కున చేర్చుకుని అన్నం పెట్టేవి. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ అన్న క్యాంటీన్లను చాలా ప్రణాళికాబద్ధంగా నిర్వహించేవారు. అన్ని క్యాంటీన్లకు పక్కా భవనాలను సైతం నిర్మించారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ జగన్ పేదల పొట్టపై కొట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్న క్యాంటీన్లను ఒక్క దెబ్బతో మూసి వేయించారు. అలా మూతపడ్డ క్యాంటీన్లు ఐదేళ్ల నుంచి తెరుచుకోలేదు.



మండపేటలో అన్న క్యాంటీన్(ఫైల్)


నేటి పరిస్థితి ఇలా

మండపేట, జూన్ 10: ఈ ఐదేళ్లలో పేదలు హోటళ్లలో అధిక ధరలకు భోజనం చేయాల్సి వచ్చేది. అయితే వైసీపీ ప్రభుత్వం పోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ పేదల ఆశలు చిగురించాయి. ఎన్నికల ప్రచారంలో కూడా అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లు తెరిచి పేదల ఆకలి తీరుస్తామని చంద్రబాబు చెప్పారు. ఈ నేపథ్యంలో త్వరలోనే అన్న క్యాంటీన్లు తెరుచుకోనున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మండపేట, రామచంద్రపురం, ముమ్మిడివరంలో అన్న క్యాంటీన్లు ఉండేవి. వాటి కోసం అక్కడ మున్సిపాల్టీల్లో భవనాలు కూడా నిర్మించారు. ఇక అమలాపురంలో మాత్రం అద్దె భవనంలో నిర్వహించేవారు. ప్రస్తుతం మండపేటలో ఉన్న అన్న క్యాంటీన్ కళతప్పి తుప్పలతో నిండి ఉంది. చాలా చోట్ల ఇలాంటి పరిస్థితే ఉంది. ఇక రామచంద్రపురం అన్న క్యాంటీన్‌ను సచివాలయంగా మార్చేశారు. ముమ్మిడివరంలోనూ అదే పరిస్థితి. రాష్ట్రంలో పాలన మారటంతో అన్న క్యాంటీన్లు తిరిగి తెరుచుకోవటం ఖాయంగా కనిపిస్తోంది.


మండపేట అన్న క్యాంటీన్‌లో భోజనాలు (ఫైల్)

రాజీనామాల పరంపర..

అమలాపురం ఏఎంసీ చైర్‌పర్సన్ పదవికి దోలామణి రాజీనామా


రాజీనామా పత్రం సమర్పిస్తున్న దోలామణి

అమలాపురం రూరల్, జూన్ 10: అమలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవికి దంగేటి దోలామణి సోమవారం రాజీనామా చేశారు. ఆమె రాజీనామా పత్రాన్ని మార్కెట్ కమిటీ కార్యాలయంలో అధికారులకు అందజేశారు. తొమ్మిది నెలల కాలంలో మార్కెట్ కమిటీ సొంత భవన నిర్మాణానికి రూ.2.40 కోట్లు మంజూరు చేయించినట్లు చెప్పారు. అదే విధంగా దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి పిచ్చిక శాంతి రాజీనామా చేసి ఆ లేఖను బీసీ వెల్ఫేర్ విభాగానికి పంపించారు.

అమల్లో 30 పోలీసు యాక్ట్

అమలాపురం టౌన్, జూన్ 10: సార్వత్రిక ఎన్నికల అనంతరం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు జిల్లా అంతా సెక్షన్ 30 పోలీసు యాక్టు అమలులో ఉంచినట్టు ఎస్పీ ఎస్.శ్రీధర్ తెలిపారు. ఎటువంటి అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దేవాలయాలు, ప్రముఖ విగ్రహాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులతో పాటు ప్రత్యేక బలగాలు నిరంతర గస్తీ నిర్వహిస్తున్నాయన్నారు. రాత్రి సమయాల్లో ఎవరైనా అపరిచితులు అనుమానాస్పదంగా సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు.

రంప అటవీ డివిజన్‌లో ఎకో టూరిజం అక్రమాలు



గుడిసెలో ఎకో టూరిజం పర్యాటక ప్రదేశం

- అర్థిక నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా నిధుల కేటాయింపు
- పరిధి దాటిన డీఎఫ్‌వో వ్యవహారాలపై విచారణకు ఆదేశించిన సీసీఎఫ్

(రంపచోడవరం)

అల్లూరిజిల్లా రంపచోడవరం అటవీ డివిజన్లో చోటుచేసుకున్న అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఈసారి ఎకో టూరిజం వంతు వచ్చి ఆ ప్రాజెక్టుల నిధుల్లో చోటుచేసుకున్న అక్రమాలపై రాజమండ్రి సి.సి.ఎఫ్. విచారణకు ఆదేశించారు. ఇప్పటికే ఈ డివిజన్లో టేకు ప్లాంటేషన్లలో చెట్ల నరికివేత వ్యవహారం రాష్ట్రస్థాయిలో సంచలనమై, బాధ్యులైన ఉన్నతాధికారులపై సైతం చర్యల కోసం ప్రభుత్వం వద్ద ఫైలు పెండింగ్‌లో ఉన్న సంగతి తెలసిందే! ఇదిలా వుండగా రంపచోడవరం డివిజనల్ అటవీ అధికారి తన పరిధికి మించి అర్థిక నిబంధనలను ఉల్లంఘించి ఏకో టూరిజం నిధులను ఇష్టారాజ్యంగా వెచ్చించడం వివాదంగా మారింది. ఏకో టూ రిజం నిధులను వేటికోసం వెచ్చించాలో, ఎవరి ఆమోదంతో వాటిని వెచ్చించాలో, కమ్యూనిటీ బేస్ట్ ఎకో టూరిజం(సి.బి.ఇ.టి) ప్రాజెక్టులకు ఉన్న కమిటీలలో ఎవరెవరు ఉండాలి వంటి అంశాలపై అటవీశాఖ నిర్దిష్టమైన ఉత్తర్వులను ఇచ్చినప్పటికీ ఉన్నతాధికారుల అనుమతులు లేకుండా రంపచోడవరం డివిజనల్ అటవీ అధికారి ఎకో టూరిజం నిధులను డ్రా చేసేందుకు, వెచ్చించేందుకు ఆదేశాలను ఇవ్వడం అటవీశాఖ ఉన్న తాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు.

వివరాల్లోకి వెళితే రంపచోడవరం అటవీ డివిజన్లో మారేడుమిల్లి వనవిహారి, వాలమూరు జంగిల్‌స్టార్, భూపతిపాలెం, గుడిసె ప్రాంతాలలో సి.బి.ఇ.టి. ప్రాజెక్టుల ద్వారా పర్యాటక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రతి ప్రాంతానికి కమిటీల ద్వారానే వీటిని నిర్వహించాలి. కొన్నిచోట్ల కమిటీలు లేకుండానే కార్యకలాపాలను అటవీశాఖ నడిపిస్తోంది. ముఖ్యంగా గుడిసె, వాలమూరు జంగిల్ స్టార్ టూరిజం ప్రాజెక్టుల ద్వారానే పర్యాటకుల నుంచి అధిక ఆదాయాలు వస్తున్నాయి. ఈ ఆదాయాలను ఆయా బ్యాంకు ఖాతాల్లో వేస్తున్నా ఎటువంటి మైక్రో ప్లానుగానీ వార్షిక ప్రణాళికలుగానీ రూపొందించకుండానే ఇక్కడ అన్ని సీబీఈటీల్లో కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. గుడిసె ప్రాజెక్టులో అయితే వాటి నిధులను కూడా కమిటీ లేకుండానే డ్రా చేయడం సాగింది.

నిధుల మళ్లింపు

ఇంతేకాకుండా ఈ టూరిజం నిధులను రంపచోడవరంలో సబ్-డీఎఫ్ఓ, డీఎఫ్ఓ నివాసాల మరమ్మతుల కోసం, ప్రహరీ గోడ నిర్మాణాలకోసం వాలమూరు జంగిల్ స్టార్ నుంచి మళ్లించేశారు. మారేడుమిల్లి వనవిహారిలో కూడా దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. ఇక్కడి నుంచి డీఎఫ్‌వో వాహనం మరమ్మతుల కోసం, సబ్ డీఎఫ్‌వో నివాసం విద్యుద్దీకరణ కోసం వెచ్చించడం కూడా వివాదమైంది. ఇటీవల రాజమండ్రి సీసీఎఫ్ కార్యాలయంలోని అంతర్గత లెక్కల విభాగం జరిపిన విచారణలో ఇలాంటి అనేక అక్రమాలు వెలుగు చూడటంతో రంపచోడవరం అటవీ డివిజన్లో చోటుచేసుకున్న సీబీఈటీ భాగోతాలపై సీసీఎఫ్ సంచార నిఘా విభాగం డీఎఫ్‌వో, అమలాపురం డీఎఫ్‌వో, పలువురు విజిలెన్సు అధికారులతో కలిపి విచారణకు ఆదేశించారు.



వెండిమబ్బుల ప్రతిబింబాలు అల్లూరి సీతారామరాజు జిల్లా వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయిలో సోమవారం శాండిల్ డ్యాం దగ్గర నీటిలో ప్రతిబింబించిన వెండి మబ్బులతో ఆకాశం పర్యాటకులను కట్టిపడేసిన ప్రకృతి అందాలు. - మోతుగూడెం

నేడు ఏపీఈఏపీసెట్ 2024 ఫలితాలు

- మధ్యాహ్నం 4గంటలకు విజయవాడలో విడుదల
- పరీక్ష రాసిన 2,58,373మంది ఇంజనీరింగ్, 80,766మంది అగ్రికల్చర్ ఫార్మసీ విద్యార్థులు

జేఎన్టీయూకే, జూన్ 10: గత నెలలో 16నుంచి 23 వరకూ ఆన్‌లైన్‌లో ఏపీ, తెలంగాణాలో 49 ప్రాంతీయ కేంద్రాల్లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ అగ్రికల్చర్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్‌టెస్ట్(ఏపీఈఏపీసెట్) ఫలితాలను మంగళవారం మధ్యాహ్నం విజయవాడలో రాష్ట్ర ఉన్నత విద్య ప్రధాన కార్యదర్శి జె.శ్యామలరావు ఫలితాలను విడుదల చేస్తున్నట్లు సెట్ ఛైర్మన్, జేఎన్టీయూకే వీసీ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. ఈ పరీక్షను 2,58,373మంది ఇంజనీరింగ్, 80,766మంది అగ్రికల్చర్ ఫార్మసీ విద్యార్థులు రాశారన్నారు. ఫలితాలను విడుదలకు ఏర్పాట్లు చేసినట్లు కన్వీనర్ తెలిపారు.

21న సప్తనదీ తీర్థ మహాజ్యేష్ఠాభిషేక మహోత్సవం



అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి

అంతర్వేది, జూన్ 10: అంతర్వేది పుణ్యక్షేత్రంలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో ఈనెల21న సప్తనదీ తీర్థ మహాజ్యేష్ఠాభిషేక మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. జ్యేష్ఠా నక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం శ్రీలక్ష్మీనరసింహస్వామి మూలవరులకు సప్తనదీ జలాలతో మహాజ్యేష్ఠాభిషేకం జరగనుంది. ఉత్తరప్రదేశ్‌లోని పవిత్ర ప్రయాగ త్రివేణి సంగమంలో గంగా, యమునా, సరస్వతి, గోదావరి, నర్మదా, సింధూ, కావేరి నదీ జాలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహిస్తారు. సప్తనదీ జలాలతో జరగబోయే మహాజ్యేష్ఠాభిషేకం, మహాశాంతి హోమంలో పాల్గొనే భక్తులు రూ.400 రుసుం చెల్లించి పూజా కార్యక్రమంలో పాల్గొనవచ్చునని ఆలయ అధికారులు తెలిపారు.

ఐటీఐ విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు

రాజమహేంద్రవరం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవే టు ఐటీఐలలో శిక్షణ పొందుతున్న చివరి ఏడాది విద్యార్థులకు ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాల కోసం ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్నామని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ కృష్ణన్ తెలిపారు. జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, వికాస, ఏపీఎస్ఎస్‌డీసీ, టాటా స్ట్రీవ్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నియా మకాలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తమ సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలు, రెజ్యూమ్‌తో ఈనెల 13న హాజరుకావాలన్నారు.

అన్నవరం దేవస్థానం పాలకమండలి సభ్యుడు రాజీనామా

అన్నవరం, జూన్ 10: అన్నవరం దేవస్థానంలో పాలకమండలి సభ్యుడిగా ఉన్న కర్రి బామిరెడ్డి జమిందారు తన రాజీనామాను అన్నవరం దేవస్థానం ఈవో రామచంద్రమోహన్‌కు అందజేశారు. ఈనెల 9న స్వచ్ఛందగా రాజీనామా చేస్తారా ఉత్తర్వులు వచ్చేవరకు ఎదురుచూస్తారా శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఆయన ఈనిర్ణయం తీసుకున్నారు. పాలకమండలిలో ఛైర్మన్‌తో కలిపి 16మంది సభ్యులుండగా ఒక సభ్యుడు మృతి చెందారు. రెండుపర్యాయాలు వరుసగా పాలకమండలిలో చోటుదక్కించుకున్న బామిరెడ్డి హుందాగా వ్యవహరించి రాజీనామా సమర్పించారని పలువురు దేవస్థానం ఉద్యో గులు చర్చించుకున్నారు. మరో వారంరోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నామినేటెడ్‌పోస్టుల రద్దు ఉత్తర్వులు అధికారికంగా వెలువడే అవకాశాలున్నాయి.

తాటిపర్తిలో కొనసాగుతున్న పోలీస్ పికెట్



గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఏర్పాటుచేసిన పోలీసు పికెట్

గొల్లప్రోలు రూరల్, జూన్ 10: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో ఏర్పాటుచేసిన పోలీసు పికెట్లు కొనసాగుతున్నాయి. గ్రామంలోని అపర్ణా సమేత నాగేశ్వరస్వామి, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల నిర్వహణపై టీడీపీ, జనసేన వర్గాల మధ్య వివాదం, తోపులాట జరిగి ఉద్రికత్తలు ఏర్పడిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో ఆలయ తాళాలను, నిర్వహణను రెవెన్యూ, పోలీసు అధికారులకు అప్పగించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు గ్రామంలోని ప్రధాన కూడళ్ళ, ఆలయాల వద్ద పోలీసుపికెట్ ఏర్పాటు చేశారు. సాయుధ బలగాలతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. పరిస్థితి ప్రశాంతంగా ఉందని పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీలు తెలిపారు.

మౌలిక వసతులు కల్పించాలని మహిళల నిరసన

అంబాజీపేట, జూన్ 10: ఎస్సీ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ కె.పెదపూడి ఓఎన్‌జీసీ సైట్ వద్ద ఎస్సీ మహిళలు సోమవారం నిరసన చేపట్టారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా నిరసనకారులు మాట్లాడుతూ ఓఎన్‌జీసీ సైట్ ఏర్పాటు చేస్తున్నట్టుగాని, పనులు నిర్వహిస్తున్నట్లుగాని గ్రామసభలు నిర్వహించిన సందర్భాలు లేవన్నారు. ఓఎన్‌జీసీ వాహనాలు రహదారులపై రాకపోకలు సాగించే సమయంలో చెంతనే ఉన్న నివాసాలు బీటలు వారే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే రహదారుల అభివృద్ధి, ఇంటింటికి మరుగుదొడ్డి ఏర్పాటు, తాగునీరు సౌకర్యం, విద్యుత్ సౌకర్యంతదితర వసతులను ఏర్పాటుచేయాలని వారు డిమాండ్ చేశారు. గ్రామంలో కమ్యూనిటీ భవనాన్ని నిర్మించాలని వారు కోరారు. వినతిపత్రాన్ని ఓఎన్‌జీసీ అధికారులకు అందించారు.

ప్రధాని మోదీ రాక సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు

రాజమహేంద్రవరం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఈనెల 12న (రేపు) చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారోత్సవానికి గన్నవరం మండలం కేశరపల్లి గ్రామ సమీపంలోని ఐటీ పార్క్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ వేడుకకు సుమారు లక్ష మంది హాజరవుతారని అంచనా వేస్తున్నారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని స్వయంగా తిలకించడానికి ప్రధాని మోదీ వస్తున్నారు. దీంతో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ట్రాఫిక్‌ని మళ్లించనున్నారు. బుధవారం ఉదయం 4గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ జాతీయ రహదారిపై సరుకు రవాణా, భారీ వాహనాలను రాష్ట్రంలో 12 చోట్ల దారి మళ్లిస్తారు. ఈ విధులకు ఏడుగురు ఐపీఎస్ అధికారులను ప్రత్యేకంగా నియమించారు. విశాఖపట్నం నుంచి చెన్నై వెళ్లే వాహనాలు హెవీ, మీడియం ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు కత్తిపూడి వద్ద దారి మళ్లించి కాకినాడ, అమలాపురం, నర్సాపురం, లోసర బ్రిడ్జి, మచిలీపట్నం, రేపల్లే, బాపట్ల, త్రోవగుంట మీదుగా ఒంగోలు వద్ద జాతీయ రహదారికి చేరుకుంటాయి. ఈ బాధ్యతలను కాకినాడ ఎస్పీ సతీశ్‌కుమార్ పర్యవేక్షిస్తారు. విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనా లను గామన్ బ్రిడ్జి, దేవరపల్లి, జంగారెడ్డిగూడెం, ఖమ్మం గుండా హైదరాబాద్ పంపిస్తారు. ఈ విధులను తూర్పుగోదావరి ఎస్పీ జగదీశ్ పర్యవేక్షిస్తారు. రేపు(బుధవారం) ట్రాఫిక్ మళ్లింపులను తెలుసుకుంటూ వాహనదారులు రాకపోకలు సాగించాలని ఈ సందర్భంగా అధికారులు విజ్ఞప్తి చేశారు. రహదార్లపై వాహనాలు నిలపడం, ట్రాఫిక్‌కి అంతరాయం కలిగించే విధంగా వ్యవహరించడం చేస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురాజు
- శ్రీప్రకాష్‌లో ముగిసిన రాష్ట్రస్థాయి టీటీ ర్యాంకింగ్ పోటీలు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న రాజా సూరిబాబురాజు

పెద్దాపురం, జూన్ 10: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు అన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురం శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీల ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతి ప్రధానం కార్యక్రమంలో ఆయన సోమవారం పాల్గొని మాట్లాడారు. చిన్నతనం నుంచి మంచి విద్యతోపాటు క్రీడలను భాగంగా చేసుకుని రోజూ నచ్చిన క్రీడలో సాధన చేయాలన్నారు. అంతర్జాతీయస్థాయిలో రాణించిన క్రీడాకారులకు క్రీడాకోటా ద్వారా మంచి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. కాకినాడ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి కె.మోహన్‌బాబు మాట్లాడుతూ నేటికాలంలో విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, తల్లిదండ్రులు సైతం తమ పిల్లలకు క్రీడలను ప్రోత్సహించే విధంగా చూడాలన్నారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ తమ పాఠశాలలో ఇటువంటి క్రీడాపోటీలను నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. సాటిమేటి క్రీడాకారులకు తమ పాఠశాల వేదిక కావడం ఇంకా సంతోషాన్ని ఇస్తోందన్నారు. అనంతరం మెన్, ఉమెన్, బాయ్స్ విభాగంలో విజేతలకు రాజా సూరిబాబురాజు బహుమతులను అందజేశారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ విజయ్‌ప్రకాష్ చేతలుమీదుగా రాజా సూరిబాబురాజును పూలమాలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో సెవెన్‌హిల్స్ పేపర్స్‌మిల్స్ ఛైర్మన్ పి.రాఘవారావు, తూతిక రాజు, చీఫ్ రిఫరీ రమణ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో కాలుజారి ఉపాధ్యాయుడి మృతి



వాసిరెడ్డి మధుసూధనరావు(ఫైల్)

యానాం, జూన్ 10: యానాంలో ప్ర మాద వశాత్తూ గోదావరిలో కాలుజారి వ్యక్తి మృతి చెందిన సంఘటన యానాం శివం హోలీబాత్ వద్ద చోటుచేసుకుంది. యానాం గాజులవారివీధికి చెందిన వాసిరెడ్డి మధుసూదనరావు(మధు) ఆది వారం సాయంత్రం యానాం శివాంహోలీబాత్‌వద్ద గోదావరిలో స్నానానికి దిగి మునిగిపోయాడు. స్థానిక మత్స్యకారులు గాలింపు చర్యలు చేపట్టినప్ప టికీ ఆచూకీ లభ్యంకాలేదు. సోమవారం మధ్యా హ్నం బీచ్‌లో మదు మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ప్రస్తు తం మదు యానాం విద్యాశాఖలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

13న మండపేటలో రాష్ట్ర ఐఎఫ్‌టీయూ సమావేశం

మండపేట, జూన్ 10: ఈనెల 13న మండపేట పట్టణంలో నిర్వహించే ఐఎఫ్‌టీయూ రాష్ట్ర జనరల్ బాడీ కౌన్సిల్ సభను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు చెప్పారు. మండపేట ఏడిద రోడ్డులో వున్న ఆర్టీసీ బస్టాండ్‌వద్ద సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఐఎఫ్‌టీయూ కార్యదర్శి చీకట్ల, ఏఐకేఎంఎస్ ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం, పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు బి.సిద్దు, ఐఎఫ్‌టీయూ నాయకుడు చింతా రాజారెడ్డి మాట్లాడారు. యాభై ఏళ్లుగా దేశంలో కార్మికవర్గాన్ని పోరాట మార్గంలో నడిపిస్తున్న ఇఫ్టూ అనేక పోరాటాలను చేస్తుందన్నారు. పోరాటాల సమయంలో అనేక మంది కార్మిక నాయకులను కోల్పోయిందని వారు చెప్పారు. కార్మికుల హక్కులకోసం మండపేటలో ఈనెల 13న జరిగే రాష్ట్రస్థాయి జనరల్‌బాడీ సమావేశంలో కార్యాచరణను రూపొందిస్తామన్నారు. సమావేశంలో మండపేట, రైస్‌మిల్లు జట్టుకార్మిక నాయకులు కె.సూరిబాబు, కె.సత్తిబాబు, కె.అన్నవరం, జి.నాగు, పి.సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు వేంకటేశ్వరరావు



సమవేశంలో మాట్లాడుతున్న నున్న తిరుమలరావు

జోసా-2024 అవేర్‌నెస్ ప్రోగ్రాం

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 10: మండలంలోని కాతేరులో తిరుమల విద్యాసంస్థల ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన జోసా-2024 అవేర్‌నెస్ కార్యక్రమానికి సుమారు 4వేల మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులు హాజరయ్యారని విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. నిన్న ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. జోసా కౌన్సెలింగ్ ఏవిధంగా ఆప్షన్స్ పెట్టుకోవాలో, ఎలా పెట్టుకుంటే ఏ బ్రాంచ్‌లలో సీట్లు వస్తాయనే విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్, ప్రిన్సిపాల్, నన్నయ యూనివర్శిటీ ప్రొఫెసర్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హోటల్‌లోకి దూసుకెళ్లిన కారు

- బాలుడి మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు





హోటల్‌లోకి దూసుకెళ్లిన కారు, ప్రమాదంలో మృతి చెందిన బాలుడు

సామర్లకోట, జూన్ 10: కాకినాడజిల్లా సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం గ్రామ బస్టాప్ వద్ద సోమవారం జరిగిన ప్రమాదంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న హోటల్ పాకలోకి దూసుకెళ్లింది. పాకలో ఉన్న ముగ్గురు వ్యక్తులతో పాటూ మూడేళ్ల బాలుడు తీవ్ర గాయాలకు గురయ్యారు. సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి హుటాహుటిన చికిత్స నిమిత్తం తరలించినప్పటికీ మార్గమధ్యలోనే బాలుడు మృతి చెందినట్లు సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు నిర్ధారించారు. మరో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. సామర్లకోట ఎస్ఐ మౌనిక సంఘటనా స్థలాన్ని చేరుకుని ప్రమాదానికి గల కారణాలను, సమాచారాన్ని సేకరించారు. వివరాల్లోకి వెళితే పెదబ్రహ్మదేవం బస్టాప్ సమీపాన మలకల చక్రరావు, సత్యవతి దంపతులు హోటల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారి మనుమడు అయిన తోటకూర సాయి సాత్విక్ వీర ప్రసన్న(3) కూడా ఉన్నాడు. ఆ సమయంలో టిక్కవోలు నుంచి సామర్లకోటకు వస్తున్న హోండాసిటీ కారు ఎదురుగా సామర్లకోట వైపు వెళుతున్న ఒక మోటార్‌సైకిల్‌ను తప్పించే ప్రయత్నంలో అదుపుతప్పి రోడ్డు పక్కన హోటల్‌లోకి దూసుకెళ్లింది. హోటల్‌లో ఉన్న చక్రరావు, సత్యవతి, బాలుడు సాత్విక్‌లను వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలుడు సాత్విక్ మృతి చెందగా చక్రరావు, సత్యవతిలు గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను సామర్లకోట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మలకల వెంకటేష్ ఫిర్యాదు మేరకు సామర్లకోట పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మౌనిక తెలిపారు.

ఘాట్ రోడ్లో అడుగడుగునా అడ్డంకులే



ఇటీవల ఘాటీ రోడ్లో నిలిచిపోయిన భారీ లారీ

- తరుచూ నిలిచిపోతున్న భారీ వాహనాలు
- ప్రయాణికులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు

మోతుగూడెం, జూన్ 10: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో తులసిపాక నుంచి మారేడుమిల్లి మీదుగా రాజమహేంద్రవరం వెళ్లే ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా తులసిపాక మారేడుమిల్లి ఘాట్ రోడ్లో ప్రమాదాలకు నిలయంగా మారింది. అల్లూరి సీతారామరాజు జిల్లా మండలాలతోపాటు తెలంగాణా, ఛతీస్‌గడ్, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్లడానికి ఈ రహదారి ఆధారం. ఈ రహదారిలో నిత్యం వాహనాల రద్దీ విపరీతంగా పెరిగిపోతుంది. తులసిపాక నుంచి రాజమహేంద్రవరం వెళ్లే ప్రధాన రహదారిలో మారేడుమిల్లి మండలం గుజ్జు, మామిడి వలస పంచాయతీ పరిధిలోని పాలమూరు నుంచి ఘాటీ రోడ్డు ప్రారంభం అవుతుంది. చింతూరు మండలం తులసిపాక వరకు 30 కిలోమీటర్లు విస్తరించి ఈ ఘాటి రోడ్లో అత్యంత ప్రమాదకరమైన మలుపులు వీటికి తోడు ఎత్తైన కొండలు, దట్టమైన అటవీ ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి. ఈ మలుపుల్లో కనీసం రక్షణ గోడలు లేకపోవడంతో మరో ప్రక్క లోతైన లోయలు ఉండటంతో ఏ మాత్రం వాహనాలు అదుపు తప్పితే ప్రమాదాలకు గురువుతున్నాయి. కల్వర్టుకు కనీసం రక్షణ గోడలు లేకపోవడంతో మరింత ఇబ్బందిగా మారింది. మారేడుమిల్లి మీదుగా భద్రాచలం వరకు ఉన్న రహదారిని అంతరాష్ట్ర రహదారిగా గుర్తించడం పైగా నాలుగు రాష్ట్రాలకు ఇదే దగ్గర దారి కావడంతో భారీ వాహనాల రాకపోకలు విపరీతంగా పెరిగిపోయాయి. ఈ క్రమంలో తులసిపాక-మారేడుమిల్లి మధ్యలో ఉన్న ఘాట్ రోడ్లో తరుచూ భారీవాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. తాజాగా భారీ ట్రాలీ లారీ మలుపులో ఇరుక్కుపోవడంతో రెండు రోజులుగా ఘాటి రోడ్డుపై భారీ వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ మార్గంలో 15 మీటర్ల పొడవుతోపాటు 30 టన్నుల బరువుమించి వాహనాలకు రాకపోకలు అనుమతిని నిషేదిస్తూ గతంలో జిల్లా కలెక్టర్ ఆంక్షలు విధించారు. దీనికి సంబంధించి మారేడుమిల్లి శివారులో ఒక హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. ఈ నిబంధనలను ప్రభుత్వశాఖలు పట్టించుకోకపోవడంతో ఇటువంటి దుర్భర పరిస్థితులు ఏర్పడుతున్నాయని పలు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఘాటీలో వాహనాలు నిలిచిపోవడంతో అవస్థలు పడుతున్న ప్రయాణికులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



జగ్గంపేట, జూన్ 10: వెంగాయమ్మపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి దుర్మరణం చెందాడు. గోకవరానికి చెందిన మందపాటి మణిరత్నం(30) గేదెల వ్యాపారం చేస్తుంటాడు. మోటారుసైకిల్‌పై స్నేహితుడితో కలిసి జగ్గంపేటలోని దూళ్ల సంతకు సోమవారం బయలుదేరాడు. మధ్యాహ్నం నుంచి గోకవరం వెళ్తుండగా వెంగాయమ్మపురం వద్ద ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ఘటనలో మణిరత్నం ప్రాణాలు కోల్పోయాడు. కేసును జగ్గంపేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మామిడికి భలే గిరాకీ

- టన్ను రూ.40వేలు



తుని రూరల్, జూన్ 10: మెట్టలో అధికంగా ఉద్యానవన పంటగా సాగవుతున్న మామిడికి ఈ ఏడాది మంచి గిరాకీ ఏర్పడింది. మెట్టలో ప్రధాన మార్కెట్‌లో నాణ్యతను బట్టి రూ.35వేలు నుంచి 40వేల వరకు భంగినపల్లిమామిడి అమ్మడు అవుతుంది. ఆశించిన మేర మార్కెట్‌లోకి కాయలు రాకపోవడంతో రాజస్థాన్, యూపీ, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. 4రోజులక్రితం మార్కె ట్ దిగువ రేట్లకు ఉన్నప్పటికీ శుక్ర, శనివారం మా ర్కెట్లో మామిడికి ఒక్కసారిగా రేటు పెరిగింది. ఈ ఏడాది ప్రతికూల వాతావరణ పరిస్థితులు కారణంగా 10శాతం పంట దిగుబడి రాలేదు. దీంతో ఉన్న పంటకు మంచిగిరాకీ ఏర్పడినట్లు మెట్ట రైతులు తెలిపారు. గతేడాది భంగినపల్లికాయలు టన్నుకు గరిష్టంగా రూ. 10వేలు నుంచి రూ.15వేలు ధర మాత్రమే రావడంతో రైతులు దిగాలు పడ్డారు. ఈ ఏడాది రేట్లు 3రెట్లు పెరిగిన దిగుబడి లేకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జనసైనికుల ఆర్థిక సహాయం

రాయవరం, జూన్10: పసలపూడికి చెందిన దూళి నాగార్జున, దూళి విజయకుమార్ ఇటీవల రోడ్డుప్రమాదంలో గాయపడ్డాడు. మండపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ ఆదేశాలతో జనసేవాదళ్ సభ్యులు నాగార్జునను పరామర్శించి రూ.20వేలు, విజయకుమార్‌ను పరామర్శించి రూ.10వేలు అందజేశారు. జనసేవాదళ్ సంస్థ సభ్యులను లీలాకృష్ణ అభినందించారు. జనసైనికులు చుట్టపు నాగరాజు, దాలిపర్తి శ్రీనివాస్, గొల్లపల్లి వెంకటరమణ, తలాటం వెంకటేష్, పసలపూడి జనసైనికులు పాల్గొన్నారు.

కూటమి ఘన విజయంతో మొక్కు చెల్లింపులు





ముమ్మిడివరం: మొక్కుబడి తీర్చుకుంటున్న టీడీపీ నాయకులు, అంతర్వేది: కొబ్బరికాయలు మొక్కు చెల్లించుకుంటున్న జనసైనికులు, కొత్తపేట: పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న పార్టీ మండల అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాస్

ముమ్మిడివరం, జూన్ 10: అనాతవరానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు అయినవిల్లి వరసిద్ధి వినాయకుని దర్శించుకుని మొక్కు తీర్చుకున్నారు. దాట్ల సుబ్బరాజు విజయం సాధిస్తే అయినవిల్లి శ్రీవరసిద్ధివినాయకుని ఆలయానికి కాలినడకన వచ్చి మొక్కు తీర్చుకుంటామని మొక్కుకున్నారు. వారంతా సోమవారం అనాతవరం నుంచి పాదయాత్రగా అయినవిల్లి సిద్ధివినాయకుని ఆలయానికి వెళ్లి మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మిమ్మితి చిరంజీవి, రామదాసు నాగబాబు, అడబాల నాని, పెయ్యల రమణ, మునుకోటి బాబి, కురసాల శివబాబు, కోట శ్రీను, మునుకోటి సాగర్, దామిశెట్టి శ్రీను, గుబ్బల నాని, వాసంశెట్టి లక్ష్మణ్, బొక్కా శివ, గోకరకొండ శ్రీను, చెల్లి కాసులతో పాటు పలువురు కాలినడకన వెళ్లి వరసిద్ధి వినాయకుని దర్శించుకున్నారు. కాలినడకన వెళ్లిన భక్తులకు అయినవిల్లి గ్రామ సర్పంచ్ కాకర శ్రీను, శివరాజులు సత్కరించారు.

కాలినడకన వచ్చి.. మొక్కు చెల్లింపు

అంతర్వేది, జూన్ 10: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సోమవారం సఖినేటిపల్లిలంక గ్రామానికి చెందిన జనసైనికులు కాలినడకన వచ్చి 108కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. స్వామివారి ఆశీస్సులతో పిఠాపురం నియోజకవర్గంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్, రాజోలు నియోజకవర్గంలో దేవ వరప్రసాద్ భారీ మెజార్టీతో విజయం సాధించడంతో స్వామివారికి మొక్కు చెల్లించుకున్నామని తెలిపారు. 108 కొబ్బరికాయలు కొట్టి స్వామిని దర్శించుకుని, ఎమ్మెల్యే విజేతల పేర్లు, గోత్ర నామాలతో అర్చన చేయించినట్టు జనసేన ప్రోగ్రాం కమిటీ సభ్యులు ముచ్చర్ల వెంకటేష్ తెలిపారు.

కూటమి ఎమ్మెల్యే అభ్యర్థుల విజయం మొక్కు కోసం ఆలయాలకు కార్యకర్తలు

పేదలకు దుప్పట్లు పంపిణీ

మామిడికుదురు, జూన్ 10: నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని పదవి చేపట్టడంతో అప్పనపల్లిలో ఆదివారం రాత్రి సంబరాలు నిర్వహించారు. స్థానిక జనసేన నాయకుడు తులా బ్రాహ్మజీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్ కేక్ కట్‌చేసి అభిమానులకు పంచారు. అనంతరం అరుంధతిపేటలోని పేదలకు దుప్పట్లు, నిత్యావసరాలను అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వాసంశెట్టి వెంకటరమణ, నాయకులు కంకిపాటి నరసంహారావు, మేడేపల్లి చినసత్యనారాయణ, బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ, కంకిపాటి సుబ్బారావు, నుదురుమాటి సత్యమాణిక్యం, టీడీపీ నాయకులు సుందరనీడి చిన్నీ, పాటి గోవిందు, బొలిశెట్టి శివ, బొలిశెట్టి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న కూటమి నాయకులు

కొత్తపేట, జూన్ 10: కొత్తపేట అసెంబ్లీ నుంచి కూటమి అభ్యర్థిగా బండారు సత్యానందరావు గెలవడంతో టీడీపీ నాయకులు మొక్కు తీర్చుకున్నారు. బండారు గెలిస్తే వాడపల్లి వెంకటేశ్వరస్వామి గుడికి పాదయాత్రగా వస్తామని మొక్కుకున్నారు. బండారు గెలవడంతో అవిడి గ్రామ పార్టీ అధ్యక్షుడు సూరంపూడి రామకృష్ణ, మాజీ సర్పంచ్ రెడ్డి తాతాజీ ఆధ్వర్యంలో 40మంది నాయకులు చేపట్టిన వాడపల్లి పాదయాత్రను పార్టీ మండల అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాస్ ప్రారంభించారు. పాదయాత్రకు దారి పొడవునా టీడీపీ నాయకులు మద్దతు తెలుపుతూ అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముత్యాల బాబ్జి, రెడ్డి రామకృష్ణ, అయిరెడ్డి రామారావు, యల్లమిల్లి జగన్మోహన్, విళ్ల మారుతీప్రసాద్, గుబ్బల మూర్తి, చోడపనీడి భాస్కరరావు, వాసంశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

రామోజీరావుకు ఘన నివాళి

రాయవరం, జూన్ 10: ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మృతికి సోమవారం సోమేశ్వరంలో పలువురు ఘనంగా సంతాపం తెలిపారు. బీజేపీ, టీడీపీ, జనసేన నాయకుల ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లొల్ల సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు, చిర్ల సుబ్బారావు, శాకా దుర్గా శ్రీనివాస్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వైట్ల రాంబాబు, శాకా కోటేశ్వరరావు, నాగేంద్ర, రాంబాబు, ఎ.శాంతారావు, ముప్పాటి కృష్ణ, ఎస్.సాయి రాంబ ప్రసాద్, నాగదేవర అమ్మిరాజు పాల్గొన్నారు.

మండపేట: రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరని లోటని సీనియర్ పాత్రికేయుడు ఎం.గణపతి అన్నారు. సోమవారం స్థానిక సీతారామకల్యాణ మండపంలో మండపేట పట్టణ పాత్రికేయులు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రామోజీ చిత్రపటానికి పాత్రికేయులు పూలమాలలువేసి నివాళులర్పించారు. పాత్రికేయులు, జి.వి.రమణమూర్తి, జి.గోపి, కె.పవన్‌కుమార్. ఆర్.ఓమేష్, సాయి, వై.సూర్యప్రకాష్, ఖరీం, స్వామి, మల్లేశ్వరరావు, మోహనరావు, అర్జునరావు, వి.నూకరాజు, కె.అప్పారావు, శివకుమార్, ఇనపకోళ్ల అబ్బు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్ పదవికి రాజీనామా

కపిలేశ్వరపురం, జూన్ 10: వెదురుమూడి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు నక్కా సింహాచలం మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి సోమవారం రాజీనామా చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ పరాజయం పొందడంతో నైతిక బాధ్యత వహిస్తూ ఈనిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. రాజీనామా పత్రాన్ని ఏఎంసీ కార్యాలయంలో అందజేసినట్లు తెలిపారు.

వైస్‌చైర్మన్ చిక్కాల రాజీనామా

మండపేట, జూన్ 10: మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చిక్కాల శ్రీను రాజీనామా చేశారు. వైసీపీ పరాజయం పాలవడంతో రాజీనామా చేసినట్టు చెప్పారు. ఈనెల7న రాజీనామా లేఖను మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు పంపించినట్టు తెలిపారు. మండపేట నియోజకవర్గ పరిధిలోని సహకార సంఘాల అధ్యక్షులు కూడా పదవులకు రాజీనామాలు చేశారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

పి.గన్నవరం, జూన్ 10: పి.గన్నవరం సీహెచ్‌సీలో ఆసుపత్రి వైద్యులు గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వేణీ ఫౌండేషన్ చైర్మన్ నల్లా గంగాఈశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భోజనాలను ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి, వైద్యులు డాక్టర్ రాఘవేంద్రరావు, డాక్టర్ గీతాగాయిత్రిలు గర్భిణులకు అందించారు. నాగుల్లంక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారులు డాక్టర్ వై.ప్రియాంక, డాక్టర్ ఆర్.మౌనిక గర్భి ణులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. బోళ్ల వీరాస్వామి సత్రం ఫౌండర్ బోళ్ల మురళీమోహన రావు ఆధ్వర్యంలో గర్భిణులకు భోజనాలు అందించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీహెచ్‌ఈవో ఎ.నాగరాజు, పీహెచ్‌ఎన్ ఏకే దుర్గాబాబు, ఎంపీహెచ్‌ఎస్‌లు టీవీవీఎస్‌ఎన్ మూర్తి, నల్లా పెద్ద కాపు, రావూరి సత్యనారాయణ, నేలపూడి రామకృష్ణ పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: అంగర పీహెచ్‌సీలో సోమవారం పీఎంఎస్‌ఎంఎ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారిణి రత్నకుమారి ఆధ్వర్యంలో 20మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ముగ్గురు గర్భిణులకు ప్రత్యేక వైద్యసదుపాయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంపీహెచ్‌ఈవో మల్లికార్జునుడు, హెచ్‌ఈ రామారావు మాట్లాడుతూ పీఎంఎంవీవై, ఈజేఎస్‌వై, ఆరోగ్య ఆసరా, పోషణ, 108, 102వాహనాల వినియోగం, వాటి ఆవశ్యకతను గర్భిణులకు వివరించారు. హెచ్‌వీ జె.మేరీమణి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణ జన్మదిన వేడుకలు

మండపేట, జూన్10: స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రముఖ సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 64వ జన్మదిన వేడుకలను సోమవారం బాలయ్య అభిమానులు, టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్‌చేసి స్వీట్స్ పంచారు. పట్టణ బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు బొడ్డు సత్యనారాయణ, నందమూరి అభిమాన సంఘం అధ్యక్షుడు నాయుడు రాంబాబు, గౌరవ అధ్యక్షుడు బోళ్ల సత్తిబాబు, గడి రాంబాబు, జొన్నపల్లి సూర్యారావు, పాలచర్ల బ్రాహ్మజీ, మాజీ కౌన్సిలర్ మందపల్లి దొరబాబు, శివకోటి శేఖర్, చుండ్రు సోమరాజు, సిద్ధిరెడ్డి రామన్న, పాలచర్ల శిరీష్, పసలపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజోలు: హిందూపురం ఎమ్మెల్యే, సినీ హీరో నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు రాజోలులో అభిమానులు, టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సంతమార్కెట్ వద్దనున్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక కట్ చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ హిందూపురం ఎమ్మెల్యేగా బాలకృష్ణ మూడోసారి ఎన్నిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అడబాల విజయ్, బోళ్ల వెంకటరమణ, షేక్ ఇస్మాయిల్, కడలి వెంకటరమణారావు, గుబ్బల కుమార్, పిన్నింటి ఆదినారాయణ, కొత్తపల్లి విజయలక్ష్మి, బోళ్ల రాజేష్, నార్కేడుమిల్లి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో మాజీ మంత్రి పూజలు

ఆత్రేయపురం, జూన్ 10: కోనసీమ తిరుమల వాడపల్లి పుణ్యక్షేత్రం శ్రీవేంకటేశ్వస్వామిని మాజీమంత్రి, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు ఏరాసు ప్రతాప్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయంలో ప్రదక్షిణలు నిర్వహించుకుని స్వామివారిని దర్శించారు. వేదపండితులు ఆశీర్వచనం అందజేశారు. పార్టీ ముఖ్య నేతలు కేవీ సత్యనారాయణరెడ్డి, కరుటూరి నరసింహారావు, కాయల జగన్నాథం ఆయనకు ఘనస్వాగతం పలికారు. అలాగే కొత్తపేట ఎమ్మెల్యేగా బండారు గెలుపొందడంపై వివిధ గ్రామాలనుంచి కూటమి పార్టీ శ్రేణులు కాలినడకన స్వామివారి సన్నిధికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తలనీలాలు సమర్పించుకుని 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు.

నాదెండ్ల మనోహర్‌ను కలిసిన జనసేన నాయకులు



మామిడికుదురు, జూన్ 10: తెనాలి ఎమ్మెల్యే విజేత నాదెండ్ల మనోహర్‌ను సోమవారం మండలానికి చెందిన జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో జనసేన విజయ దుందుభి మోగించడంతో ఆయనతో కలిసి ఆనందాన్ని పంచుకుని అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారి చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ అడబాల తాతకాపు, విళ్ల సుబ్బారావు, కంకిపాటి నరసింహారావు, గుబ్బల పండు, బళ్ల సతీష్ పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల విజేతలకు అభినందనలు



ఆలమూరులో టీడీపీ, జనసేన మహిళా నాయకులను సత్కరిస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్, జూన్ 10: బీసీ ఉద్యోగ సంక్షేమ సంఘం జిల్లా శాఖ సమావేశం అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సోమవారం నిర్వహించారు. జిల్లా శాఖ అధ్యక్షుడు గుబ్బల మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. అమలాపురం ఎంపీగా గంటి హరీష్‌మాధుర్‌తో పాటు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల విజేతలకు అభినందనలు తెలుపుతూ తీర్మానించారు. బీసీ ఉద్యోగుల సమస్యలను అమలాపురం, రామచంద్రపురం ఎమ్మెల్యే విజేతలు అయితాబత్తుల ఆనందరావు, వాసంశెట్టి సుభాష్ దృష్టికి తీసుకువెళతామన్నారు. జిల్లాలోని అందరూ ఎమ్మెల్యేలను కలుసుకుని ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరనున్నట్టు ఉపాధ్యక్షుడు సరిదే సత్యపల్లంరాజు తెలిపారు. ఆర్థిక కార్యదర్శి పీవీ గోపాలం, రాష్ట్ర నాయకులు బీవీవీఎస్ మూర్తి, ఎస్.రాజరాజేశ్వరి, నాయకులు విత్తనాల శ్రీనివాస్, కడలి వెంకటేశ్వర్లు, పెచ్చెట్టి శ్రీనివాస్‌తో పాటు వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన మహిళా నాయకులకు సత్కారం

ఆలమూరు, జూన్ 10: సార్వత్రిక ఎన్నికల్లో కొత్తపేట నియోజకవర్గ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు విజయంలో కీలకపాత్ర పోషించిన తెలుగుదేశం, జనసేన మహిళలను సోమవారం సత్కరించారు. ఆలమూరు తెలుగుదేశం పార్టీ నాయకుడు ఈదల సత్తిబాబు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో టీడీపీ మహిళా నాయకులు, జనసేన వీరమహిళలకు ఆయన సమకూర్చిన నూతన వస్త్రాలు, శాలువాలతో సత్కరించి స్వీట్స్ అందించారు. కార్యక్రమంలో ఆలమూరు తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుబ్బరాజుకు మంత్రి పదవి ఇవ్వాలి



ముమ్మిడివరం, జూన్ 10: రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని క్షత్రియ సామాజికవర్గానికి చెందిన ముమ్మిడివరం నియోజకవర్గ ఎమ్మెల్యే విజేత దాట్ల సుబ్బరాజుకు (బుచ్చిబాబుకు) మంత్రివర్గంలో స్థానం కల్పించాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మోకా ఆనంద్‌సాగర్ పార్టీ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. ముమ్మిడివరంలోని టీడీపీ కార్యాలయంలో నాగిడి నాగేశ్వరరావు అధ్యక్షతన సోమవారం జరిగిన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, పార్టీ సీనియర్ నాయకుడు నాగిడి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావులు మాట్లాడుతూ దాట్ల సుబ్బరాజు నియోజకవర్గ పరిధిలోనే కాకుండా జోన్-2 పరిధిలో అత్యంత సమర్థత కలిగిన నాయకుడిగా పార్టీలోను, ప్రజల్లోను గుర్తింపు పొందారన్నారు. సుబ్బరాజును చంద్రబాబు కేబినేట్‌లో తీసుకుని ఆయనకు సముచిత స్థానం కేటాయించాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. సమావేశంలో గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, పొద్దోకు నారాయణరావు, వాడ్రేవు వీరబాబు, దొమ్మేటి రమణకుమార్, మందాల గంగసూర్యనారాయణ, అర్థాని శ్రీనివాసరావు, నడింపల్లి సుబ్బరాజు, ఆకాశం శ్రీనివాస్, జనిపల్లి సోమన్న, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, టేకుమూడి లక్ష్మణరావు, పొన్నమండల రామలక్ష్మి, దండుప్రోలు సత్యం, రాయపురెడ్డి నీకలంతేశ్వరరావు, చిక్కాల అంజిబాబు, సాగి సూరిబాబురాజు, యాళ్ల ఉదయ్, గుద్దటి జమి, దూడల స్వామినాయుడు, గోదశి పుండరీష్, గొల్లపల్లి గోపి, మెండి కమల పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన దోషులను శిక్షించాలి



డీఆర్వో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అమలాపురం టౌన్, జూన్ 10: యర్రపోతవరంలో అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానపరిచిన దోషులను వెంటనే అరెస్టు చేయాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టిబత్తుల తులసీరావు ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు. తొలుత గొల్లగూడెంలోని ప్రజా సంఘాల కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించి అంబేడ్కర్ విగ్రహాలపై జరుగుతున్న అవమానకర దాడులపై చర్చించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు గెడ్డం విజయ్‌కుమార్, పాలమూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాల వద్ద సీసీ కెమెరాలు

మలికిపురం, జూన్ 10: మండలంలో అంబేడ్కర్ విగ్రహాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని ఆయా సంఘాలకు తెలిపినట్టు ఎస్ఐ బి.సంపత్‌కుమార్ తెలిపారు. ఇటీవల కోనసీమ జిల్లా కె.గంగవరం యర్రపోతవరం లాకుల వద్ద గుర్తుతెలియని వ్యక్తులు అంబేడ్కర్ విగ్రహానికి అవమానం కలిగించారని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అంబేడ్కర్ విగ్రహాల వద్ద సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. విశ్వేశ్వరాయపురం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను ఆయన పరిశీలించారు. చవ్వాకల సుందరరావు, నరేష్, పారుపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాల జోలికి వస్తే ఊరుకోం

మామిడికుదురు, జూన్ 10: అంబేడ్కర్ విగ్రహాల జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తి లేదని దళిత సంఘాల నాయకులు హెచ్చరించారు. పెదపట్నం గ్రామంలో దళిత నాయకుల సమావేశం సోమవారం భూపతి వెంకటపతి ఇంటి వద్ద నిర్వహించారు. సమావేశంలో పలువురు మాట్లాడుతూ కె.గంగవరం మండలం యర్రపోతవరం గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన నిందితులను వెంటనే అరెస్టుచేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో బొంతు మణిరాజు, మట్టా సత్తిబాబు, కుసుమ పెరుమళ్ల కుమార్ పాల్గొన్నారు.

యర్రపోతవరంలో పోలీస్ పికెట్

కె.గంగవరం, జూన్ 10: యర్రపోతవరంలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పులు దండ వేసి అవమాన పరచిన విషయ విదితమే. దీంతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. శాంతిభద్రతల పర్యవేక్షణ కోసం సోమవారం పోలీసులు గ్రామంలో పోలీస్ పికెట్ కొనసాగించారు. అనుమానితులను విచారిస్తున్నట్లు ఎస్ఐ కె.జానీ బాషా చెప్పారు.

దోషులను శిక్షించాలి

రామచంద్రపురం (ద్రాక్షారామ), జూన్ 10: కె.గంగవరం మండలం యర్రపోతవరంలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండవేసి అవమానించిన కేసులో దోషులను తక్షణం శిక్షించాలని కోనసీమ జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడు, ఎస్సీ మోర్చా రాష్ట్ర మాజీ కార్యదర్శి పెయ్యల రాంబాబు కోరారు. దోషులను అరెస్టు చేయకపోతే ఆందోళన చేపడతామన్నారు.

ఎరుకుల హక్కుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు బండారు మృతి



అమలాపురం టౌన్, జూన్ 10: ఎరుకుల హక్కుల సంక్షేమం కోసం నిరంతరం పోరాటాలు చేసిన సంక్షేమ సంఘం అధ్యక్షుడు బండారు ఏడుకొండలు (57) ఆకస్మికంగా మృతిచెందారు. సోమవారం బండారు కుటుంబ సభ్యులను పలువురు పరామర్శించి ఓదార్చారు. ఏడుకొండలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈయనకు భార్య అనంతలక్ష్మితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బండారు గోవిందు, బండారు రవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి

రావులపాలెం, జూన్10: వైసీపీ ప్రభుత్వపాలనలో తీవ్రంగా నష్టపోయిన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏరాసు ప్రతాపరెడ్డి అన్నారు. ఊబలంకలో ఎంఎస్ఎన్ రెడ్డి ఇంటి వద్ద మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ప్రతాపరెడ్డి మాట్లాడారు. సీఎంగా ప్రమాణ స్వీకారంచేసిన అనంతరం చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు నిరంతరం కృషి చేస్తారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చినట్లు చెప్పారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై ఎన్నికల ముందు ఇచ్చిన హామీమేరకు సంతకం చేస్తారన్నారు. వాడపల్లి దేవస్థానం మాజీ చైర్మన్ కరుటూరి నరసింహారావు, కాయల జగన్నాథం, శ్రీనివాసరెడ్డి, నల్లిమిల్లి దొరరెడ్డి, సర్వేశ్వరరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

లోకేశ్‌ను సత్కరించిన రమణబాబు



అమలాపురం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్‌ను మంగళగిరి టీడీపీ కార్యాలయంలో సోమవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు మర్యాద పూర్వకంగా కలుసుకుని సత్కరించారు. అనంతరం మండపేట ఎమ్మెల్యే విజేత వేగుళ్ల జోగేశ్వరరావును కలుసుకుని అభినందించారు. అలాగే రామచంద్రపురం ఎమ్మెల్యే విజేతగా నిలిచిన వాసంశెట్టి సుభాష్‌ను సోమవారం మెట్ల రమణబాబు, నాయకులు చిక్కాల గణేష్, గంధం పల్లంరాజు, ఆశెట్టి ఆదిబాబు, బొర్రా ఈశ్వరరావులు మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆత్రేయపురం, జూన్ 10: మండలంలోని పదిహేడు గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ రవికుమార్ తెలిపారు. ఆత్రేయపురం, పేరవరం, అంకంపాలెం పరిధిలోని అన్ని గ్రామాలకు ఉదయం 8నుంచి మధ్యాహ్నం 11గంటల వరకు 33కేవీ మరమ్మతుల కారణంగా సరఫరా ఉండదన్నారు.

లీలాకృష్ణను కలిసిన సుభాష్

కపిలేశ్వరపురం, జూన్ 10: వల్లూరులో జనసేన పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ వేగుళ్ళ లీలాకృష్ణను సోమవారం రామచంద్రపురం ఎమ్మెల్యే విజేత వాసంశెట్టి సుభాష్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసారు. సుభాష్‌ను లీలాకృష్ణ సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: --
వెంకటరమణ	: మనమే
శ్రీలలిత	: రక్షణ
శేఖర్ స్క్రీన్-1	: ప్రేమించొద్దు
శేఖర్ స్క్రీన్-2	: బ్యాడ్‌బాయ్స్
రమా	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
గణపతి	: బాక్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: సత్యభామ
వెంకటపద్మావతి స్క్రీన్-2	: భజే వాయువేగం

'వేగుళ్లకు మంత్రి పదవి ఇవ్వాలి'

మండపేట, జూన్ 10: మండపేట ఎమ్మెల్యే విజేత వేగుళ్ల జోగేశ్వరరావుకు మంత్రి పదవి ఇవ్వాలని మండపేట నియోజకవర్గ టీడీపీ శ్రేణులు టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. మండపేటలో టీఎస్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి వాదా ప్రసాదరావు సోమవారం విలేకరులతో మాట్లాడారు. మండపేట నుంచి నాల్గవ సారి విజయం సాధించిన వేగుళ్లకు మంత్రి పదవి ఇవ్వాలని వాదా ప్రసాదరావు, పాలచర్ల శిరీష్, కాశిన కాశీవిశ్వనాథం, కాళ్లకూరి శ్రీను, మచ్చా నాగు, చుండ్రు సోమరాజు, చింతల శ్రీను, కొవ్వాడ అప్పన్నబాబు, నెల్లపూడి సత్యనారాయణ, బదుగురత్నం రాజు కోరారు.

'బండారుకు మంత్రివర్గంలో చోటు కల్పించాలి'

కొత్తపేట, జూన్ 10: జిల్లాలో అత్యధిక మెజార్టీ సాధించి సీనియర్‌గా ఉన్న బండారు సత్యానందరావుకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని టీడీపీ నాయకులు కోరారు. సోమవారం కొత్తపేటలో వారు మాట్లాడుతూ వివాదరహితుడుగా అన్నివర్గాలు ఆదరించే నాయకుడిగా పేరున్న బండారు ఎనిమిది సార్లు అసెంబ్లీకి పోటీచేసి నాలుగోసారి అసెంబ్లీకి ఎన్నికైన నేపథ్యంలో పార్టీ అధిష్ఠానం బండారుకు మంత్రివర్గంలో స్థానం కల్పిస్తే అభివృద్ధి జరుగుతుందన్నారు. టీడీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి వీరా ఇశాక్, సీనియర్ నాయకులు మిద్దే ఆదినారాయణ, కముజు గంగాధర్, గుబ్బల మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం

మలికిపురం, జూన్ 10: ఉద్యోగ విరమణ చేసిన ఎంపీడీవో ముత్యం వీరాస్వామినాయుడు దంపతులను ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో బి.మంగాదేవి, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, ఆర్.ఏసుబాబు, రమణ, సూర్యప్రకాశరావు, దివ్యభారతి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

అమలాపురంటౌన్, జూన్10: బాల్య విద్యతో చిన్నారుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు ముందుకు సాగుతున్నాయని అమలాపురం సీడీపీవో విజయకుమారి అన్నారు. పేరూరు సెక్టార్ సూపర్‌వైజర్ కె.అన్నపూర్ణ ఆధ్వర్యంలో కామనగరువు పితానివారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం గ్రాడ్యుయేషన్‌డే వేడుకలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో బాల్య విద్య పూర్తి చేసుకున్న చిన్నారులను 1వ తరగతిలో ప్రవేశాలకు ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తున్నట్టు తెలిపారు. చిన్నారుల తల్లిదండ్రుల సమక్షంలోవేడుకలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కె.దుర్గాబాయి, సీహెచ్ పద్మ, యు.నిర్మలకుమారి, ఎం.వెంకటరమణమ్మ, బి.భీమాబాయి, జె.ధనలక్ష్మి, ఎన్.మంగాదేవి, జి.సరితాజ్యోతి, ఆయాలుపాల్గొన్నారు.

రేపు షమ్మీ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్

యానాం, జూన్10: యానాం నియోజవర్గంలో పుదుచ్చేరి క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షమ్మీ క్రికెట్ టోర్నమెంట్ తుది దశకు చేరుకుంది. స్థానిక మెట్టకుర్రు ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో జరుగుతున్న ఈటోర్నీలో 10జట్లు పాల్గొన్నాయి. నాకౌట్ లీగ్ పద్ధతిలో జరుగుతున్న మ్యాచ్‌ల్లో సోమవారం సెమీ ఫైనల్ పోటీలు జరిగాయి. నాగలెవన్స్- కేవీఆర్ జట్ల మధ్య సెమీ ఫైనల్ మొదటి మ్యాచ్ జరగ్గా నాగలెవన్స్ విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. రెండో సెమీ ఫైనల్ అంబేడ్కర్ లెవన్స్-అగ్నిలైన్స్ జట్ల మధ్యజరగ్గా నాగాలెవన్స్ విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. బుధవారం మధ్యాహ్నం 1.30గంటలకు అంబేడ్కర్ లెవన్స్-నాగా లెవన్స్ మధ్య ఫైనల్ మ్యాచ్ జరగనుంది. తృతీయస్థానం కోసం కేవీఆర్-అగ్నిలైన్స్ మధ్య జరగనుంది. ఈపోటీలను యానాం క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.రమేష్, కె.సుబ్బారావు, చిట్టి, ప్రసాద్, ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధి పి.సుమన్‌బాబు, సత్యం, జయచంద్ర, సత్యనారాయణ, ప్రసాద్ పర్యవేక్షిస్తున్నారు.

రూ.50వేలు విరాళం

ఆత్రేయపురం, జూన్ 10: కోనసీమ తిరుమల వాడపల్లి పుణ్యక్షేత్రం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. అన్నప్రసాద ట్రస్టుకు పిఠాపురానికి చెందిన పోడిపిరెడ్డి రాజ్యలక్ష్మి కుటుంబ సభ్యులు రూ.50వేలు విరాళం సమర్పించారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒకరోజు ఆదాయం రూ.2,21,293 లభించినట్టు డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిశోర్ కుమార్ తెలిపారు.

ఎమ్మెల్యే విజేత సుభాష్‌కు అభినందనలు



సుభాష్‌కు అభినందనలు తెలుపుతున్న ఎన్ఆర్‌ఈజీఎస్ సిబ్బంది

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 10: రామచంద్రపురం నియోజకవర్గ ఎమ్మెల్యే విజేత వాసంశెట్టి సుభాష్‌కు సోమవారం నియోజవర్గానికి చెందిన వివిధ శాఖల అధికారులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. మున్సిపల్ కమిషనరు బి.శ్రీనివాసులు, డీఈఈ దుర్గాప్రసాద్, మేనేజరు, సిబ్బంది సుభాష్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ద్రాక్షారామ భీమేశ్వరాలయం కార్యనిర్వహణాధికారి పి.తారకేశ్వరరావు, సిబ్బంది అభినందనలు తెలిపారు. అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ఇరిగేషన్, ఎన్ఆర్‌ఈజీఎస్, ఆర్‌అండ్‌బీ డీఈఈ, ఏఈఈ, ఆర్డీవో కార్యాలయ అధికారులు, సిబ్బంది, డిప్యూటీ తహసీల్దార్లు, సిబ్బంది వివిధ శాఖల అధికారులు అభినందనలు తెలిపారు. మాజీ ఏఎంసీ చైర్మన్లు గిరిగిపాటి సూర్యనారాయణ మూర్తి, కొమరిన వీర్రాజు నియోజకవర్గంలో వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఎమ్మెల్యే విజేత సుభాష్‌కు పూలమాలలువేసి అభినందనలు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో సుభాష్ నివాసం కిటకిటలాడింది.

చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపిన నేతలు



పి.గన్నవరం, జూన్ 10: రెండో సారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుకు నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్య దర్శి డొక్కా నాధ్‌బాబులు ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. గన్నవరంలో కూటమి అభ్యర్థి విజయానికి చేసిన కృషికి ఇద్దరు నేతలతో పాటు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలకు చంద్రబాబు అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో పనిచేయాలని, త్వరలో అన్నివిషయాలు చర్చించుకుందామని చంద్రబాబు వారికి సూచించారు. కూటమి ఎమ్మెల్యే విజేత, నాయకులు, కార్యకర్తలతో కలిసి నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని వారికి చంద్రబాబు సూచించారు.

లోకేశ్‌ను కలిసిన యండగండి చౌదరి



కె.గంగవరం, జూన్ 10: టీడీపీ జాతీయ కార్యదర్శి, మంగళగిరి ఎమ్మెల్యేగా ఎన్నికైన నారా లోకేశ్‌ను చుండ్రు వీఎస్ఎస్ చౌదరి (యండగండి) కలిశారు. అత్యధిక మెజార్టీతో గెలిచిన సందర్భంగా పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. రామచంద్రపురం నియోజకవర్గంలో వాసంశెట్టి సుభాష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించినందుకు తమను లోకేశ్ అభినందించినట్లు చౌదరి చెప్పారు.

సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమం లైవ్

మామిడికుదురు, జూన్ 10: ఈనెల12న ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యక్రమాన్ని వీక్షించేందుకు మండల పరిషత్ కార్యాలయంలో డిజిటల్ స్క్రీన్స్ ఏర్పాటు చేసినట్టు మండల పరిషత్ అధికారులు తెలిపారు. మూడు పార్టీల నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రమాణ స్వీకారాన్ని వీక్షించాలని కోరారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

యానాం, జూన్ 10: యానాంలో విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు వేసేందుకు దేశవ్యాప్తంగా విస్తృతస్థాయిలో ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వాలనే నేపథ్యంలో సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం యానాం విద్యా శాఖ పరిధిలో ఉన్న ఉపాధ్యాయులకు సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, విద్యా శాఖ అధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్, ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు ప్రారంభించారు. ఈసందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రాంతీయ పరిపాలనాధికారి మాట్లాడారు.

చెస్ రేటింగ్ టోర్నమెంట్‌లో ప్రతిభ

అమలాపురం టౌన్, జూన్ 10: భీమవరంలో జరిగిన అంతర్జాతీయ చెస్ రేటింగ్ టోర్నమెంట్‌లో అమలాపురం విక్టరీ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చాటినట్టు చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తాడి వెంకటసురేష్ తెలిపారు. ఓపెన్ విభాగంలో ద్రాక్షారపు సాత్విక్ 13వర్యాంకు సాధించి రూ.7వేలు నగదు బహుమతి అందుకున్నాడు. కేశనకుర్తి రాజేష్, తాడి సాయివెంకటేష్‌లు రూ.10వేలు నగదు బహుమతిని అందుకున్నారు. ఈనెల4 నుంచి 9వరకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 300మంది చెస్ క్రీడాకారులకు ఈపోటీలు నిర్వహించినట్టు వెంకటసురేష్ తెలిపారు.

బీజేపీ సంబరాలు

కాట్రేనికోన, జూన్ 10: నరేంద్రమోదీ మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో కాట్రేనికోనలో బీజేపీ శ్రేణులు సోమవారం ఉత్సవాలు నిర్వహించారు. ముమ్మిడివరం నియోజకవర్గ కన్వీనర్ గొలకోటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో గ్రంధి నానిబాబు స్వగృహం వద్ద పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. జిల్లా కోశాధికారి గ్రంధి నానాజీ, మండల శాఖ అధ్యక్షుడు మట్ట సూరిబాబు, సుంకర నాగేశ్వరరావు, మట్ట శివకుమార్, కోట సత్యప్రసాద్, మట్ట సురేష్, గ్రంధి మణికంఠ, రమేష్ పాల్గొన్నారు.

పాము కాటుకు వ్యక్తి మృతి

ముమ్మిడివరం, జూన్ 10: పాము కాటుకు కౌలు రైతు మృతి చెందాడు. గాడిలంకలో కొబ్బరి తోటను కౌలుకు తీసుకుని ఆ తోటలో అంతర పంటగా సాగుచేసిన అరటి మొక్కలకు మందు పెడుతుండగా కౌలు రైతు అరిగెల బాలాజీ (53)ను ఆదివారం సాయంత్రం పాము కాటు వేయడంతో అపస్మారక స్థితికి లోనయ్యాడు. అతడిని ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఉప్పలగుప్తం మండలం సన్నవిల్లికి చెందిన అరిగెల బాలాజీకి భార్య దుర్గాభవానీ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ డి.సురేష్‌బాబు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఇసుక గుట్టలపై మైన్స్ అధికారుల ఉక్కుపాదం

రావులపాలెం, జూన్ 10: మండలంలోని అనధికారిక ఇసుక గుట్టలపై మైన్స్ అధికారులు ఉక్కుపాదం మోపారు.మల్లయ్యదొడ్డి, లక్ష్మీపోలవరం రోడ్డులో ఉన్న, మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఇసుక కొండలను మైన్స్, సెబ్, రెవెన్యూ అధికారులు పరిశీలించి ఇసుక గుట్టలను సీజ్‌చేశారు. తహశీల్దార్ అశోక్‌వర్మను వివరణ కోరగా మైన్స్, సెబ్‌అధికారులు ఇసుక గుట్టలను పరిశీలించి సీజ్‌చేయాలని తమకు సమచారం ఇవ్వడంతో సిబ్బందిని పంపామన్నారు. సీజ్‌చేసిన ఇసుక గుట్టలను రెవెన్యూశాఖకు అప్పగించినట్లు చెప్పారు.